## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ



గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ మహేందర్ తదితరులున్నారు.

### సన్మానం



పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ల పదవీ కాలం మరో ఆర్నెళ్లపాటు పొడిగించిన క్రమంలో మండలంలోని చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, డైరెక్టర్ గోపాల్‌రావులను అంబేడ్కర్ సంఘం నాయకులు శుక్రవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం పురోగతికి, రైతులకు సేవలు అందించడానికి కృషి చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, జిల్లా కన్వీనర్ భాస్కర్, నాయకులు జెరిపోతుల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### నాటుసారా స్వాధీనం



నర్సంపేట రూరల్ : అక్రమంగా రవాణా చేస్తున్న 20 లీటర్ల నాటుసారాతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. నర్సంపేట మండలంలోని మాధన్నపేట శివారులో అక్రమంగా నాటుసారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టినట్లు సీఐ చెప్పారు. ఈ క్రమంలో పర్శనాయక్‌తండాకు చెందిన సామాగ్ర్ ద్విచక్ర వాహనంలో 20 లీటర్ల నాటుసారా తీసుకెళ్తూ పట్టుబడ్డట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై శార్వాణి, సిబ్బంది సురేందర్, నాగరాజు, హైమద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### 'డ్రంకెన్ డ్రైవ్'లో జైలు శిక్ష

నర్సంపేట రూరల్ : మద్యం సేవించి వాహనం నడిపిన (డ్రంకెన్ డ్రైవ్) కేసులో నిందితుడికి మూడ్రోజుల జైలు శిక్ష విధించినట్లు నర్సంపేట టౌన్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... నర్సంపేటలో ఈనెల 19న వాహనాల, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా కేసముద్రం మండలంలోని కాట్రపల్లికి చెందిన గొట్టె వెంకన్న మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి స్థానిక సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా న్యాయమూర్తి మూడ్రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

### 'వర్గపోరు తగదు'

గీసుకొండ : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీలో వర్గపోరు తగదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద అనిల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని వాపోయారు. అందరిని కలుపుకునిపోవాలని ఆకాంక్షించారు. రడం భరత్ మండలంలో పార్టీకి జీవం పోస్తున్నారని చెప్పారు. సమావేశంలో మాజీ సర్పంచ్ గోపీ, అశోక్, మాజీ ఎంపీటీసీ వీరరావు తదితరులు పాల్గొన్నారు.

### షాపు మూసివేత

నర్సంపేట : మున్సిపాలిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోని పట్టణంలోని హనుమాన్ ఎలక్ట్రానిక్స్, శానిటరీ షాపును అధికారులు శుక్రవారం మూసివేయించారు. మున్సిపాల్టీ ఆదాయానికి గండికొట్టేలా ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఇటీవల అధికారులు హెచ్చరించగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే హనుమాన్ ఎలక్ట్రానిక్స్, శానిటరీ షాపును మూసివేయించారు.

### కారు ఢీకొని గాయాలు

చెన్నారావుపేట : కారు ఢీకొని కొరికి గాయాలైన ఘటన మండలంలోని జల్లి గ్రామ ప్రధాన కూడలి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. లింగగిరికి చెందిన గోనె యాకయ్య తన స్కూటీపై అమీనాబాద్ నుంచి జల్లి దిశగా వస్తుండగా అమీనాబాద్‌కు చెందిన చిప్ప రాజు నడుపుతున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. యాకయ్యకు తీవ్ర గాయాలు కావడంతో కానిస్టేబుల్ క్రాంతికుమార్ 108 అంబులెన్స్‌లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

# బాబోయ్ కోతులు

- పల్లెల్లో గుంపులుగా సంచారం
- పంటలకు భారీగా నష్టం



అంబేడ్కర్ సెంటర్‌లో కోతుల గుంపు

నెక్కొండ : కోతులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో ఇళ్లల్లోకి వానరాలు చొరబడి వస్తువులను ఎత్తుకెళ్తూ అడ్డుకునే ప్రయత్నం చేసే వారిపై దాడి చేయడమే కాకుండా పంట చేలల్లోనూ గుంపులుగా సంచరిస్తూ జనాన్ని, రైతులను వణికిస్తున్నాయి. ఇటీవల మండలంలోని తేజావత్ తండాలో రైతు వెంకన్న వానర దాడికి బెదిరి పరుగు తీసిన ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన తెలిసిందే. కోతుల నుంచి పంటలను కాపాడుకోవడంలో రైతులు ఆపసోపాలు పడుతున్నారు. అధికారులు, ప్రభుత్వం కోతుల బెడద నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

కొద్దిరోజులుగా మండలంలోని బొల్లికొండ, పెద్ద కొర్పోలు, నెక్కొండ, గుండ్రపల్లి, మడిపల్లి, సూరిపల్లి, చంద్రుగొండ, దీక్షకుంట, తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నాగారం, బొల్లికొండ, గొట్లకొండ, సూరిపెల్లి, తదితర అటవీ ప్రాంతాల నుంచి కోతులు సమీపంలోని గ్రామాల్లోకి వస్తున్నాయి. గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తూ పిల్లలను, వృద్ధులను పరిగెత్తిస్తున్నాయి. చేతిలో తినుబండారాలు, అరటిపండ్లు, ఇతరత్రా ఉంటే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోంది. చేతిలో కర్ర ఉన్నా కోతులు దాడికి వెనుకాడడం లేదంటూ పలువురు తెలిపారు. గ్రామాల్లోని ముఖ్యకూడళ్లలోని రోడ్లపైనే కోతులు తిష్టవేసి వచ్చే, వెళ్లే వారి చేతుల్లో ఉన్న సంచులు, ఇతరత్రాలను లాక్కుంటున్న దుస్థితి నెలకొంది. ఇళ్లల్లోకి, దుకాణాల్లోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. పెరట్లో పెరిగే చిన్నచిన్న పూల మొక్కలను నాశనం చేస్తున్నాయి. ఇళ్ల పెంకులు పీకేస్తుండడంతో ఏటా ఇళ్లకు మరమ్మతు చేయించుకోవాల్సి వస్తోందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతాల నుంచి గ్రామాలకు వస్తున్న క్రమంలో మొక్కజొన్న, ఇతర పంటలపై పడి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితులతో రైతులు పంట చేల వద్ద చేతుల్లో కర్రలతో కాపలా ఉంటున్న దుస్థితి నెలకొంది.

### పంటలు నష్టపోతున్నాం



మొక్కజొన్న, తదితర పంటలతోపాటు కూరగాయల చెట్ల పూల మొక్కలపైనేఆ కోతులు గుంపుగా దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయి. ఇల్లు వదిలి కర్రలతో పంట చేల వద్ద రైతులు కాపలా కాయాల్సి వస్తోంది. ఒంటరిగా ఉన్న ఉన్న రైతులపై దాడికి కోతులు తెగబడుతున్నాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు చేలను వదిలి పరుగు తీయాల్సి వస్తోంది.

\- తేజావత్ శేషగిరి, రైతు, మడిపల్లి

### వెంటపడుతున్నాయి



జనం చేతుల్లో పండ్లు, కూరగాయలుంటే కోతులు వెంటపడుతున్నాయి. దుకాణాలపైనా దాడి చేసి అందినంత వరకు పండ్లు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లుతున్నాయి. రాత్రివేళలో దుకాణాలు మూసి వెళ్తుండగా కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పండ్ల, కూరగాయలపై కట్టి ఉంచిన పరదాలను చించుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు హడలిపోతున్నారు.

\- వద్యాలపు వెంకటేశ్, పండ్ల వ్యాపారి

# అంగన్‌వాడీ భవనం మంజూరుకు చర్యలు

- కలెక్టర్ సత్యశారద



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

సంగెం : మండలంలోని గుంటూరుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి భవనం మంజూరీకి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మండలానికి శుక్రవారం వచ్చిన సందర్భంగా ఆమె రోడ్డు పక్కనే ఉన్న ఉప పశు వైద్యశాలలో అంగన్‌వాడీ బాలలు ఉండడాన్ని గమనించి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరగా నూతన భవనం మంజూరు చేయలేదని అంగన్‌వాడీ టీచర్, పంచాయతీ కార్యదర్శి చెప్పగా కలెక్టర్ స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సత్యశారద సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలోని నర్సరీతో ఇబ్బందులున్నాయని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఎంపీడీఓతో సమీక్షిస్తానని భరోసా ఇచ్చారు.

# మాతృభాషతో సృజనాత్మకత పెంపు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్



నర్సంపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : మాతృభాషతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మాతృభాష మీద పట్టు సాధిస్తే ఇతర భాషలను సులభంగా నేర్చుకోవచ్చని చెప్పారు. మాతృభాష మాత్రమే సంపూర్ణ వికాసానికి తోడ్పడుతుందని చెప్పారు. తెలుగు విభాగాధిపతి రజిత మాట్లాడుతూ గతానికి, వర్తమానానికి, భవిష్యత్తుకు వారధిగా మాతృభాష నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి రహీముద్దీన్, హిందీ విభాగాధిపతి గాయత్రి, వైస్ ప్రిన్సిపాల్ బైరి సత్యనారాయణ, అకాడమీ కోఆర్డినేటర్ కందాల సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ సోమయ్య, అధ్యాపకులు కమలాకర్, రాంబాబు, సంధ్య, భద్రు, రాజీరు, రుద్రాణి, పూర్ణచందర్, వీరన్న, రమేశ్, గ్లోరీ, మాధవి, లక్ష్మి, ఆనందరావు, నిజాం, శ్రీనివాస్, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ సరళ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు కవితలు, నాటికలు, నృత్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరాచారి, జగన్మోహన్, వెంకటేశ్వర్లు, సరిత, అనిత, సరిత, అశోక్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పాశం కోమల, ఉపాధ్యాయులు పర్వీన్, ఫాతిమ, ఇంద్రసేనారెడ్డి, అనంతరెడ్డి, రఘుపతి, అరుణ్‌కుమార్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని కొమ్మాల జెడ్పీ హైస్కూల్‌లో కృత్యమేళా నిర్వహించగా ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మోహన్‌రావు, సంపత్‌రావు, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు కుమారస్వామి, లయన్స్ క్లబ్ ప్రతినిధి రాంగోపాల్‌రెడ్డి, సారంగం, తదితరులు పాల్గొన్నారు.

# పథకాల ప్రచారంతో పార్టీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న కందికట్ల అనిల్

- యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనిల్

పర్వతగిరి : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల అమలుతోపాటు ప్రజలకు ఇవ్వని హామీలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల, ఇతర ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపులో యువజన నాయకుల పాత్ర కీలకమని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్, మండల ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్, నాయకులు కొమ్ము రమేశ్, మూడు దేవరాజ్, నీరటి ప్రశాంత్, యాకూబ్ పాషా, లోకేశ్, నూనె మణికంఠ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

సంగెం : మండల కేంద్రలలోని గంగా భవానీ సమేత సంఘమేశ్వరాలయంలో ఈనెల 23 నుంచి 27 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కందకట్ల నరహరి తెలిపారు. ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని 26న ప్రత్యేక పూజలు ఉంటాయని, రాత్రి 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, అర్ధరాత్రి 1.15 గంటలకు శివపార్వతుల కల్యాణం ఉంటాయని తెలిపారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి ఆగపాటి రాజు, అర్చకుడు అప్పె నాగార్జున శర్మ, నాయకులు మెట్టుపల్లి రమేశ్, గుండేటి బాబు, మెట్టుపల్లి మల్లయ్య, కోడూరి సదయ్య, మునుకుంట్ల కోటేశ్వర్, కక్కెర్ల శరత్, సాంబయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళా కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా మమత



దుగ్గొండి : మహిళా కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండలంలోని పొనకల్‌కు చెందిన కోతి మమతను నియమించారు. ఈ మేరకు ఆమెకు జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మమత మాట్లాడారు. మహిళా విభాగం బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. మహిళలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేలు అందిస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

**మండల అధ్యక్షురాలిగా..**

నెక్కొండ : మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మండలంలోని గుండ్రపల్లికి చెందిన తాటిపర్తి నాగేంద్రమ్మ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి చేసిన కృషికి గుర్తింపుగానే నాగేంద్రమ్మను రెండోసారి నియమించినట్లు తెలిపారు. అనంతరం నాగేంద్రమ్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు

- సీఐ రాజగోపాల్, ఏఓ ప్రశాంత్‌కుమార్



ఫర్టిలైజర్ షాపులో తనఖీ చేస్తున్న అధికారులు

పర్వతగిరి : నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రాజగోపాల్, ఏఓ ప్రశాంత్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. షాపుల అనుమతి పత్రాలను పరిశీలించారు. స్టాక్ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్, ఏఓ ప్రశాంత్‌కుమార్ మాట్లాడారు. వ్యాపారస్తులు ప్రభుత్వం అనుమతించిన ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ మాత్రమే రైతులకు విక్రయించాలని చెప్పారు. ఫర్టిలైజర్స్ షాపులకు సంబంధించిన అనుమతి పత్రాలను చెక్ చేశారు. బిల్లులు లేకుండా పురుగు మందులు విక్రయించొద్దని తెలిపారు. నకిలీ మందులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 'ఎమ్మెల్సీగా సుందర్‌రాజ్‌ను గెలిపించండి'



ప్రచారం చేస్తున్న శ్రీనివాస్, ఉపాధ్యాయులు

నెక్కొండ : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సుందర్‌రాజ్‌ను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని గౌతమి విద్యానికేతన్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రచార కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకమన్నారు. బీసీ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలు బలపర్చిన స్వతంత్ర ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన సుందర్‌రాజ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆశాజ్యోతి, శ్యామ్, వీరస్వామి, కుమారస్వామి, నారాయణ, ప్రమోద్, లక్ష్మి, రాకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్వాన నాటికలను విజయవంతం చేయాలి

వర్ధన్నపేట : పట్టణంలోని భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో కళాభవన్ ప్రాంగణంలో నేటి (శనివారం) నుంచి 26 వరకు నిర్వహించనున్న 51వ ఆహ్వాన నాటికల పోటీలను విజయవంతం చేయాలని అధ్యక్షుడు అఫ్సర్ కోరారు. స్థానిక కళాసమితి ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22న ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 26న ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కడియం కావ్య బహుమతులు అందజస్తారని వివరించారు. తదుపరి వరంగల్‌కు చెందిన కాకతీయ నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, డాక్టర్ వెంపటి శ్రావణి శిష్య బృందం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. తొలుత కార్యక్రమ ప్రతాలను ప్రదర్శించారు. సమావేశంలో కళాసమితి సభ్యులు మాశెట్టి సోమయ్య, సమ్మెట శ్రీనివాస్, సిలువేరు కుమారస్వామి, వడ్లకొండ రాజు, వేణు, సమ్మెట సుధీర్, సంజీవరావు, యుగంధర్, రాజ్‌కుమార్, తుమ్మల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పోలీస్ అధికారి సేవలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సాయిరమణ

- సీఐ సాయిరమణ

దుగ్గొండి : ప్రజలకు గ్రామాల్లోనే విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీఓ) సేవలు అందుతాయని సీఐ సాయిరమణ తెలిపారు. మండలంలోని చలపర్తిలో స్థానిక బాధ్యతలు నిర్వర్తించనున్న గ్రామ పోలీస్ అధికారి పేరు, ఫొటోతో ముద్రించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేసే లక్ష్యంతో గ్రామాలకు పోలీస్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా స్థానికంగా విధులు నిర్వర్తించనున్న పోలీస్ అధికారిని సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో చోటు చేసుకునే నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై వీపీఓలకు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, పీసీలు వేణుకుమార్, రంజిత్‌కుమార్, రాజ్‌కుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్

నర్సంపేట : రాష్ట్రంలోని విద్యార్థులకు బకాయి ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించినా ఇప్పటివరకు విడుదల చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించే క్రమంలో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, చందు, రాజ్‌కుమార్, ఆకాశ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

నల్లబెల్లి : గుండ్లపహాడ్ ఎఫ్‌సీఐ గోదాంలకు బియ్యం తరలిస్తున్న లారీలను మండలంలోని బజ్జు తండావాసులు శుక్రవారం అడ్డుకున్నారు. ఎస్సై గోవర్ధన్ చేరుకుని తండావాసులతో మాట్లాడారు. లారీల ప్రయాణంతో దుమ్మూధూళితో రోగాల బారిన పడుతున్నామని, ఓవర్ లోడ్‌తో లారీలు ప్రయాణిస్తుండడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని తండావాసులు ఎస్సైకి వివరించారు. లారీలను రుద్రగూడెం మీదుగా పంపించాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని, అప్పటి దాకా లారీలను అడ్డుకోవద్దని తండావాసులకు ఎస్సై సూచించారు. ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో రాంసింగ్, రాజు, మెహన్, కొమ్మాలు, సంతోష్, సామ్య, చందర్, రాందాస్, కొమ్మాలు పాల్గొన్నారు.

### సబ్సిడీ కొనసాగించాలి

రాయపర్తి : టాక్సీ, మోటార్ క్యాబ్ సబ్సిడీ కొనసాగించాలని కోరుతూ ప్రజాసంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గబ్బెట బాబురావు ఆధ్వర్యంలోని బృందం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సంధ్యారాణికి శుక్రవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం బాబురావు మాట్లాడారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ద్వారా టీ-ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న క్రమంలో ట్యాక్సీ, మోటార్ క్యాబ్ సబ్సిడీలను రద్దు చేస్తూ పరిశ్రమల శాఖ డైరెక్టర్ జీఓ జారీ చేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి సదరు జీఓను ఉపసంహరించుకునేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సమితి రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అంజయ్య, అడ్డూరి శ్రీనివాస్ తదితరులున్నారు.

### దంపతులపై కోతుల దాడి

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపులలో దంపతులపై కోతులు దాడి చేశాయి. వివరాలిలా.. గ్రామానికి చెందిన తాళ్లపల్లి అహల్య-జనార్దన్ దంపతులు ఇంటి ఆవరణలోని కూరగాయల చెట్ల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చేపల వలలో శుక్రవారం కోతిపిల్ల చిక్కుకుంది. ఈ క్రమంలో కోతిపిల్లను వల నుంచి రక్షించేందుకు అహల్య, జనార్దన్ ప్రయత్నిస్తున్న క్రమంలో వారిపై కోతుల గుంపు దాడి చేసింది. స్థానికులు దంపతులను ఆస్పత్రికి తరలించారు.

### వీడ్కోలు సమావేశం

సంగెం : మండలంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### ఎస్సారెస్పీ కాల్వ గేటు తొలగింపు సరికాదు

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన కొందరు రైతులు జేసీబీతో ఎస్సారెస్పీ కాల్వ గేటు తొలగించడం సరికాదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాల్వ గేటును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించగా పలువురు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా రిజర్వాయర్‌లోకి వచ్చే కాల్వ గేటు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రిజర్వాయర్ త్వరగా నిండాలనే ఉద్దేశంతో గేటును పూర్తిగా తొలగించారని తెలుస్తోంది. కట్ట తొలగింపుతో ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

# బలవర్ధక ఆహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

- కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనూష

గీసుకొండ : విద్యార్థులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలరని కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనూష తెలిపారు. ధర్మారం జెడ్పీ హైస్కూల్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం, క్యాల్షియం, విటమిన్-డి, డబ్లుఐఎఫ్ఎస్, తదితర పోషక లోపాల వల్ల కలిగే అనర్థాలు, పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐరన్, విటమిన్ల లోపం వల్ల గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు, వయోజనులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఎంఈఓ సాంబయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ నల్లబెల్లి రాజు, ఓఆర్ డబ్ల్యూ కొత్తపెల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఫోరం కార్యదర్శి రాజవీరు

చెన్నారావుపేట : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొడగాని రాజవీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యలను వివరిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖలు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాజవీరు మాట్లాడారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమించాల్సిన రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యమకారుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాడి వీరారెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు సింగారపు సునీల్, మండల అధ్యక్షుడు ఉప్పునూతుల లింగమూర్తి, ఉపాధ్యక్షుడు ఊడుగుల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి మెడిద లక్ష్మణ్, నాయకులు శీలం రాజు, ముత్తయ్య, కొమురయ్య, సూరయ్య, రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.